సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 29 । జూలై । 2025



మురికి కూపం..

ఒడిశా మురుగునీటి కాలువలతో పాతపట్నం వాసులు ఇబ్బంది పడుతున్నారు. పొలాల్లోనికి వ్యర్థాలు వస్తున్నాయి.
- 8లో



యువకుడి మృతిపై ఆందోళన

పెద్దబమ్మిడికి చెందిన యువకుడి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల్లిదండ్రులు దీనిపై ర్యాలీ చేశారు.
- 8లో

'పి-4 విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం'

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం పి–4 విధానంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నియోజకవర్గ యూటీఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోంపేట ఉన్నత పాఠశాలలో నియోజక వర్గంలోని నాలుగు మండలాల యూటీఎఫ్ ప్రతినిధులు సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు మాట్లాడుతూ బోధనేతర పనులు ఉపాధ్యాయులకు అప్పగించడం దారుణమన్నారు.

న్యూస్‌రీల్

ఎచ్చెర్ల ఎంపీపీ చిరంజీవి అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని ఎచ్చెర్ల మండలానికి చెందిన ఎంపీపీ మొదలవలస చిరంజీవిని ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం వేకువఝామున ఫరీదుపేటలోని ఆయన స్వగృహానికి జిల్లా పోలీసుల సహకారంతో ఒడిశా పోలీసులు చేరుకుని వారెంటు చూపించి అరెస్టు చేసినట్లు జేఆర్ పురం సీఐ అవతారం పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. 1999లో ఒడిశాలోని కొరాపుట్ జిల్లా దమన్‌జోడి పోలీస్ స్టేషన్ పరిధిలో నాల్కో కంపెనీ తరఫున కాంట్రాక్ట్ పనులు చేయించారని, వ్యాపార లావాదేవీల్లో అక్కడ గొడవ రావడంతో చిరంజీవిపై కేసు నమోదైందన్నారు. చిరంజీవిని రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు.

'కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి'



కాలువ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన రహదారులు, భవనాల శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌తో కలసి ఆయన నూతన కలెక్టరేట్ భవనాన్ని, అక్కడ జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యతపై ఎక్కడా రాజీ పడకూడదన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ తిరుపతిరావు, కాంట్రాక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు జూద శిబిరంపై ఆదివారం రాత్రి దాడి చేసి ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జి.సింహాచలం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. ఇక్కడ కొందరు వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు పక్కా సమాచారం టాస్క్ ఫోర్స్‌కు పోలీసులకు సమాచారం అందడంతో శిబిరంపై దాడి చేసి ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, పాతపట్నం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారని, వారి వద్ద నుంచి రూ.1,12,030 నగదు, ఆరు ద్విచక్రవాహనాలు, ఎనిమిది సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పోస్టాఫీస్ వద్ద ఖాతాదారుల ఆందోళన



పోస్టాఫీస్ వద్ద ఆందోళనకు దిగిన ఖాతాదారులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సబ్‌పోస్టాఫీస్ వద్ద ఖాతాదారులంతా సోమవారం ఆందోళన చేపట్టారు. సబ్‌పోస్టాఫీస్‌లో గడిచిన డిసెంబర్ నెలలో 33 ఖాతాలు ఆన్‌లైన్ మోసాల బారిన పడి సుమారు రూ.2కోట్ల86లక్షలు మాయమైనట్లు.. ఈ నెల 25వ తేదీన కొంతమంది ఖాతాదారులకు పోస్టల్ అధికారులు తెలిపారు. దీంతో ఆ రోజు నుంచి సోమవారం వరకు పోస్టాఫీస్‌లో గల ఖాతాల పై దర్యాప్తుని పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, కమల్‌హాసన్ చేపడుతున్నారు. ఇప్పటి వరకు కేవలం కిసాన్‌వికాస్ పత్ర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మాత్రమే ఈ స్కామ్ జరిగినట్లు భావిస్తుండగా.. ప్రస్తుతం మిగిలిన ఖాతాలకు కూడా ఇదేవిధంగా జరిగిందని కొంతమంది ఖాతాదారులు పోస్టల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఖాతాదారులు సోమవారం పోస్టాఫీస్ వద్ద ఆందోళనకు దిగారు. దీనిపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో పోస్టల్ సూపరింటెండెంట్ వచ్చి ఖాతాదారులతో చర్చిస్తారని పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు అన్నారు.

వాటిని తెరిస్తే తంటాలే..!

- సోంపేట మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడికి వారం రోజుల కిందట ఆర్‌టీఓ ట్రాఫిక్ చలాన్.ఏపీకే అనే లింకు వాట్సాప్ ద్వారా వచ్చింది. దీంతో క్లిక్ చేసి అన్ని లాంఛనాలు పూర్తి చేసి లాగిన్ అయ్యారు. లాగిన్ అయ్యాక ఓటీపీ అడగడం, ఓటీపీ ఎంటర్ చేసిన కొన్ని నిమిషాల్లోనే తన ఫోన్ సిమ్ పనిచేయకపోవడం.. కొన్ని గంటల్లోనే తన బ్యాంకు ఖాతాలోని సొమ్ము మాయమవ్వడం చకచకా జరిగిపోయాయి. దాదాపు రూ.7లక్షలు పోయినట్లు తేలడంతో పోలీసులను ఆశ్రయించారు.
- కాశీబుగ్గకు చెందిన ఓ బ్యాంకు మేనేజర్ టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన ఇదే లింకుపై క్లిక్ చేశాడు. అంతే పై మాదిరిగానే సైబర్ కేటుగాళ్లు రూ.10 లక్షలకు పైగా తన వివిధ బ్యాంకు ఖాతాల నుంచి సొమ్మును లాగేసుకున్నారు.



- ఏపీకే ఫైల్స్‌తో నయా సైబర్ మోసాలు
- ట్రాఫిక్ చలానా యాప్‌లతో మోసం
- 20 రోజుల్లో 12కుపైగా కేసులు
- ఒక్కొక్కరికి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పైగా టోకరా
- మోసపోయినవారిలో ఉపాధ్యాయులు, బ్యాంకు మేనేజర్ సహా ముగ్గురు ఎస్‌ఐలు




శ్రీకాకుళం క్రైమ్ : ఆర్‌టీఓ ట్రాఫిక్ చలాన్.ఏపీకే.. జిల్లాను దాదాపు నెల రోజులుగా వణికిస్తున్న లింకు ఇది. బండిపై ఎంత చలానా ఉందో తెలుసుకోవాలనే ఉత్సాహంతో ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేశారో.. ఇక అంతే.. ఖాతా ఖాళీ అయిపోతుంది. ఇప్పటికే గత 20 రోజుల్లో దాదాపు 12 కేసులు దీనిపైనే నమోదయ్యాయి. పైగా దీని బాధితులంతా ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారే కావడం గమనార్హం.

మోసపోతున్నారిలా..

- ముందుగా 'ఆర్‌టీఓ టిఆర్ఏఎఫ్ఎఫ్ఐసి సిహెచ్ఏఎల్ఎల్ఏఎన్.ఎపికె' ఫైల్ మెసేజ్ లింక్ రూపంలో వస్తుంది.
- మనం క్లిక్ చేసిన వెంటనే లాగిన్ అని వస్తుంది. అయ్యాక వెంటనే ఓటీపీ అడుగుతుంది.
- ఓటీపీ ఎంటర్ చేశామా ఇక అంతే సంగతులు.. సైబర్ నేరగాళ్ల మెసేజ్ ఇన్‌బాక్స్‌లో మన ఫోన్ నంబర్ చేరుతుంది.
- వెంటనే మన ఫోన్ నంబర్ ఉన్న సిమ్‌ను అదే నంబర్‌తో ఎలక్ట్రానిక్ సిమ్‌గా మార్చుతారు.
- మన ఫోన్‌పై ఉన్న స్క్రీన్ వారి ఆధీనంలోకి వెళ్లిపోతుంది.
- మన ఫోన్ పనిచేయక తికమక పడుతున్న ఆ క్షణాల్లోనే సిమ్ అప్‌డేట్ అవ్వాలంటే మన మెయిల్ అడ్రస్ యాడ్ చేయాలని అందులో వస్తుంది.
- మనం మెయిల్ అడ్రస్ యాడ్ చేసిన వెంటనే సిమ్ ఛేంజెస్ ఎస్ ఆర్ నో అని వస్తుంది. ఎస్ అని క్లిక్ చేసిన వెంటనే ఐదు, పదినిమిషాల్లో ఓ క్యూఆర్‌కోడ్ రావడం.. మన ఫోన్ నంబర్‌తో ఉన్న సిమ్‌కార్డు సైబర్ నేరస్తుడి మొబైల్ నుంచి యాక్టివేట్ అయిపోవడం జరుగుతుంది.

సైబర్ అలర్ట్



మొబైల్‌లో ఇలా వస్తుంది.. ఏపీకే ఫైల్

- వెంటనే సైబర్ నేరగాడు ఎమ్.ఆధార్ యాప్ డౌన్‌లోడ్ చేసి మన ఫోన్ నంబరే కావడంతో వచ్చే ఓటీపీలను ఎంటర్ చేసి బయోమెట్రిక్ లాక్ చేసేస్తాడు. దాంతో మనం సిమ్ కొనాలని షాపులకు వెళ్లినా.. ఆధార్ అవసరంతో బ్యాంకు, రిజిస్ట్రేషన్, ఇతర ఏ పనుల్లో మనం బయోమెట్రిక్‌కు థంబ్ వేయాలని అనుకున్నా అది లాక్ చేయడంతో కుదరదు. ఇక మనకు సిమ్ దొరకదు.
- ఈ లోగా సైబర్ నేరగాడు మన ఆధార్ నంబర్, ఫోన్ నంబర్‌తో ఇంటర్నెట్ త్రూ డెబిట్ కార్డ్ లోన్స్, లోన్ యాప్స్, పేయింగ్ యాప్స్ (ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే) తదితర మార్గాల్లో వస్తువులు కొనేయడం,డబ్బులు మాయంచేసి మన బ్యాంకు ఖాతాలను కొల్లగొట్టేయడమే కాక రూ.లక్షల్లో లోన్లు వాడేసి మనకు రుణ భారాన్ని మిగుల్చుతారు.
- ఇదే తరహాలో సోంపేట ఉపాధ్యాయునికి జరగడం, చాలా రోజుల వరకు తన నంబర్ ఉన్న సిమ్ రాకపోవడంతో తన వేలి ముద్రలు పనిచేయడం లేదని పాత (మాన్యువల్) పద్ధతిలోనే సిమ్‌ను పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ఇటువంటి మోసాలు అత్యధికంగా కాశీబుగ్గ, సోంపేట, ఇచ్ఛాపురంలోనే జరిగాయని, చేసే సైబర్ నేరగాళ్లు జార్ఖండ్ వాసులుగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.


ఎం.పరివాహన్ యాప్‌లోనే కట్టాలి..



వాహన దారులు సామాజిక మాధ్యమాల్లో ఇలా వచ్చే ఏపీకే ఫైల్స్ లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. జిల్లా పోలీసు కార్యాలయం ఆధీనంలో ఉండే ఈ–చలానా యాప్ అనేది ట్రాఫిక్ పోలీసులకు, ఆ పరిధి పోలీస్‌స్టేషన్‌లో ఉండే పోలీసుల మొబైల్లకు అనుసంధానంగా ఉంటుంది. ప్లేస్టోర్‌లో దొరకదు. సాధారణ ప్రజల వద్ద ఉండదు. దాని ద్వారా పోలీసులు ఫైన్‌లు వేశాక మీసేవలో గాని సొంత మొబైల్ ఫోన్‌లో గాని ఎం.పరివాహన్ యాప్ ద్వారానే కట్టాలి. ఎం.పరివాహన్ యాప్ అనేది ప్లేస్టోర్‌లో ఉంటుంది.

– నాగరాజు, సీఐ, శ్రీకాకుళం ట్రాఫిక్

పోలీసులకే బురిడీ



సైబర్ మోసాల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన పోలీసుల్ని సైతం ఇదే తరహా లింక్‌తో సైబర్ కేటుగాళ్లు మోసం చేశారు. జిల్లాలోని వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న ముగ్గురు ఎస్‌ఐలకు ఈ అనుభవం ఎదురైంది. జేబులు కూడా ఖాళీ అయినట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. ఈ అంశాన్ని పోలీస్ శాఖ సీరియస్‌గానే తీసుకుంది.

ఇసుక అక్రమ రవాణాపై రైతుల కన్నెర్ర

- వసపలో ఇసుక వాహనాలు అడ్డుకున్న రైతులు
- అక్రమ తవ్వకాలు ఆపాల్సిందేనని డిమాండ్



వసప వద్ద ధర్నా చేస్తున్న రైతులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ

కొత్తూరు: కొత్తూరు మండలంలోని బలద ఇసుక ర్యాంపు పేరుతో వసప గ్రామం సమీపంలో వంశధార నది వద్ద నిర్వహిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై రైతులు సోమవారం కన్నెర్ర చేశారు. భారీ వాహనాలు తమ పొలాల దారి మీదుగా వెళ్తుండడంతో నిత్యం భయపడుతున్నామని తెలిపారు. ఇసుక టిప్పర్లు వెళ్లకుండా రోడ్డు మీద బైఠాయించి ఆందోళన చేశారు. ఇసుక వాహనాల రాకపోకల వల్ల తాము కనీసం బైక్‌పై ఎరువులు కూడా తీసుకెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సంఘీభావం తెలపడం విశేషం. బలద రెవెన్యూ పరిధిలో ఉన్న ఇసుక ర్యాంపు నిర్వహించాలని ప్రభుత్వం మంజూరు చేస్తే వసప గ్రామం వద్ద ర్యాంపు నిర్వహించడం తగదన్నారు. ఇసుక ర్యాంపును నిలుపుదల చేయాలని తహసీల్దార్‌ను ఫోన్‌లో కోరారు.

యూరియా కోసం రైతుల అవస్థలు



యూరియా కూపన్ల కోసం పాట్లు పడుతున్న రైతులు

నరసన్నపేట: యారబాడు సచివాలయం వద్ద రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడ్డారు. 450 బస్తాల యూరియా సచివాలయానికి రాగా సోమవారం పంపిణీ చేశారు. మడపాం, బుచ్చిపేట, కొత్తపేట, వీఎన్ పురం, యారబాడు, లింగాలపాడు, కోటారపల్లి గోకయ్యవలస, చేనులవలస తదితర గ్రామాల నుంచి రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. తక్కువ స్టాకు రావడంతో రైతులు ఎగబడ్డారు. యూరియా కూపన్ల కోసం తోపులాట జరిగింది.

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు



సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు సోమవారం స్థానిక బీసీ వెల్ఫేర్ హాస్టల్, ఎస్సీ హాస్టల్, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పిల్లల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్స్‌లోని మౌలిక సదుపాయాలు, భద్రత, పరిశుభ్రత తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో అడ్వకేట్, సంఘసేవకులు కె.ఇందిరా ప్రసాద్, ఆయా వసతి గృహాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాతో బాలిక మృతి

కంచిలి: మండలంలోని కొనక గ్రామానికి చెందిన పదమూడేళ్ల బాలిక గాయత్రి దొండియా మలేరియా జ్వరంతో మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. ఈ బాలిక గ్రామ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ జ్వరం బారిన పడింది. ఈ నెల 17వ తేదీన మఠం సరియాపల్లి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయడంతో మలేరియా జ్వరంగా తేలింది. పరిస్థితి విషమించడంతో సోంపేట సీహెచ్‌సీకి రిఫర్ చేయగా, అక్కడి నుంచి బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు సుస్మితారెడ్డి వివరించారు.

అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకొన్నాయి. మృతురాలి తండ్రి బైలోడు, తల్లి తిలోత్తమలు కూలీలుగా జీవిస్తున్నారు. వీరికి మృతి చెందిన బాలికతోపాటు రెండేళ్ల కుమారుడు నితిన్ ఉన్నాడు. బాలికకు మలేరియా పాజిటివ్ రావడంతో గ్రామంలో వైద్యశిబిరాన్ని కూడా నిర్వహించారు.



గాయత్రి దొండియా (ఫైల్)

ఇచ్చుకో... పుచ్చుకో..

దొరికినంత దోచుకో..?

- కూటమి ప్రభుత్వం విధానం ఇదే..
- సర్కారుపై మండిపడిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: సుపరిపాలన పేరుతో తెలుగుదేశం నేతలు ప్రజల్లోకి వెళుతుంటే, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ.. పేరుతో తాము ప్రజల్లోకి వెళుతుంటే పెద్ద ఎత్తున ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో సోమవారం మాట్లాడారు. ఏడాది కాలంలోనే 90 మంది ఎమ్మెల్యేలపైన పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉన్నట్లుగా సర్వేల్లో వెల్లడైందన్నారు. ఇంత ప్రజావ్యతిరేకతను కూడా లెక్కచేయకుండా ముందుకు వెళుతున్నారంటే గత ఎన్నికల్లో మాదిరిగా ఈవీఎంల మేనేజ్‌మెంట్‌పై కూటమి ఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తోందని స్పష్టం చేశారు. అందుకే విలువైన ప్రభుత్వ భూములను కూడా ఎలాంటి జంకు లేకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేస్తున్నారని అన్నారు. ఇందులో ఇచ్చుకో... పుచ్చుకో... దొరికినదంతా దోచుకో దాచుకో అనే పద్ధతిలో డబ్బు చేతులు మారుతోందన్నారు.

గత ఏడాది సెప్టెంబర్‌లో నారా లోకేష్ అమెరికాకు వెళ్లిన సందర్భంలో ఉర్సా ప్రమోటర్లను కలిశారని, వారు ఈ ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్‌కు వచ్చి ఒక కంపెనీని రిజిస్టర్ చేశారని, తర్వాత నెల రోజుల్లోనే ఉర్సాకు ఏప్రిల్‌లోనే 99 పైసలకు ఎకరం కట్టబెట్టేశారన్నారు. కనీస ఆర్థిక సామర్థ్యం లేని ఆ సంస్థకు వేల కోట్ల రూపాయల విలువైన భూములను ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దీనికి ముందు టీసీఎస్, కాగ్నిజెంట్ కంపెనీలకి 99 పైసలకే భూములిచ్చారన్నారు. ఈ కంపెనీతో ఒప్పందంలో ఆ సంస్థలు 2029 తర్వాత నుంచి ఉద్యోగాలను కల్పిస్తామని పేర్కొన్నాయన్నారు. వైఎస్సార్, జగన్ హయాంలో ఇన్ఫోసిస్, అదానీ డేటా సెంటర్, అమెజాన్ వంటి సంస్థలు వచ్చాయన్నారు. వారితో ఇలాగే ఒప్పందాలు చేసుకున్నారా? అని ప్రశ్నించారు. విశాఖలో ఐటీ అభివృద్ధికి డాక్టర్ వైఎస్సార్ హయాంలోనే కృషి చేశారు తప్ప, చంద్రబాబు హయాంలో ఒక్కటి కూడా రాలేదన్నారు.


మిట్టల్ సంస్థ చెల్లింపులకు వాయిదాలా?

ఆర్సెల్లార్ మిట్టల్‌తో సంప్రదింపులు చేసింది జగన్ హయాంలోనేనని సీదిరి గుర్తు చేశారు. దీన్ని నారా లోకేష్ వీడియో కాల్ మాట్లాడగానే మిట్టల్ రాష్ట్రానికి వచ్చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ సంస్థ కూడా దాదాపు రూ.1100 కోట్లతో భూమిని కొనుగోలు చేయాల్సి ఉందని, ఆ కంపెనీకి మొదట రూ.450 కోట్లు కట్టించుకుని, మిగిలిన మొత్తాన్ని మూడు వాయిదాల్లో చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. లక్ష కోట్లతో పరిశ్రమ పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థకు కేవలం రూ.1100 కోట్లు ప్రభుత్వానికి భూమి కోసం చెల్లించాల్సి ఉంటే, ఇన్ని వాయిదాలు ఎలా ఇస్తారు? ఇవి కాకుండా పన్నుల్లో అనేక రాయితీలు ఇవ్వడం వెనుకున్న లాలూచీ ఏమిటని ప్రశ్నించారు. సత్వా అనే కంపెనీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని, వేలంలో ఖరీదైన భూములను కొనుగోలు చేసే సామర్థ్యం ఉందని, ఐటీ కంపెనీల పేరుతో వాటికి భూములు కేటాయించి, రాయితీలు ఎలా ఇస్తారని సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు.


పేదల భూములపై

పెద్దల కన్ను

- వైఎస్సార్ హయాంలో మంజూరు చేసిన భూములను లాక్కునే కుట్ర
- ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బంధువులతో కూడిన అమెరికన్ బృందం పరిశీలనతో లబోదిబోమంటున్న లబ్ధిదారులు



రాజపురంలో కొండ పోరంబోకు డీ పట్టా భూమిలో పెంచుకున్న జీడితోట



కవిటి: పారిశ్రామిక అభివృద్ధి పేరుతో పేదలకు ఇచ్చిన భూములను పెద్దలకు కట్టబెట్టే విష ప్రయత్నం జరుగుతోంది. 270 మందికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో మంజూరు చేసిన డీ పట్టా భూము లను స్థానిక ఎమ్మెల్యే సహకారంతో కాజేసే కుట్ర జరుగుతోందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కవిటి మండలం రాజపురంలో సుమారు 270 మందికి పైగా ఎస్సీ, బీసీ కులాలకు చెందిన పేదలకు ఇచ్చిన డీపట్టా భూముల్లో.. స్థల సమీకరణ అంశం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్టు వస్తున్న వార్తలు ఆ స్థలాల లబ్ధిదారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. వారి సాగు హక్కులో ఉన్న ఈ పట్టా భూ ముల స్థల పరిశీలనకు తాజాగా అమెరికాకు చెందిన ఓ ప్రతినిధి బృందం రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా నుంచి వచ్చిన ప్రతినిధి బృందంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ బంధువు కూడా ఉండడం విశేషం. తమకు దఖలు పడిన ఈ కొండ పోరంబోకు భూముల్ని రెక్కలు ముక్కలు చేసి జీడి మామిడి, పనస తోటలుగా రైతులు అభివృద్ధి చేశారు.

ఇవే భూములకు సంబంధించి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పట్టాలు కూడా తాము పొందినట్టు లబ్ధిదారులు చెబుతున్నారు. సర్వే నంబర్ 358లో 10.19 ఎకరాలు, 359లో 7.32 ఎకరాలు, 234లో 4.28 ఎకరాలు, 360లో 5.61 ఎకరాలు, సర్వే నంబర్ 199లో 17.16 ఎకరాలు, 218–4లో 12.01 ఎకరాలు, 275లో 6.49 ఎకరాలు, 279లో 4.54 ఎకరాలు, సర్వే నంబర్ 357లో 5.49 ఎకరాల భూముల్ని ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వే బృందం కొలతలు వేసి వివరాల్ని యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసింది. ఈ భూముల్లో ఒక్కో రైతుకు అర ఎకరానికి అటు ఇటుగా 270 మంది రైతులు డీ పట్టాలు పొందినట్టు లబ్ధిదారులు చెబుతున్నారు. ఆనాటి నుంచి ఎన్నో వ్యయప్రయాసలతో సాగు చేసిన భూమి వెనక్కి లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదు బాధిత రైతులు అంటున్నారు. ముందస్తు సమాచారం తెలపకుండానే రెవెన్యూ అధికారులు గోప్యంగా సర్వేలు నిర్వహించడం పై రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఏపీఐఐసీ నుంచి వచ్చిన ఆదేశాలతో..

ఏపీఐఐసీ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రాప్తికి కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ స్థలాన్ని పరిశీలించాం. ఆ వివరాల్ని కలెక్టర్‌కు నివేదించాం. ఉన్నతాధికారుల ఆదేశాలు మేం పాటించాం.

–బి.మురళీమోహనరావు, తహసీల్దార్, కవిటి

రహస్య సర్వేలు ఎందుకు..?



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 270 కుటుంబాలకు రెండు దశాబ్దాల క్రితం డీపట్టా భూమిని కేటాయించారు. ఈ భూముల చుట్టూ 3000 పైగా ఈత చెట్లను పెంచుకుంటూ రాజపురానికి చెందిన కల్లుగీత కార్మికులు కూడా బతుకుతున్నారు. తాజాగా ఓ అమెరికా వ్యాపార సంస్థ ప్రతినిధులు ముందస్తు సమాచారం పంచాయతీకి, అక్కడ రైతులకు తెలియజేయకుండా ఇక్కడకు రావడం దురదృష్టకరం. ఇంతమంది పేదల కడుపుకొట్టి ఇక్కడ పారిశ్రామిక అభివృద్ధి ఎంతవరకు సమంజసం.

– సనపల కృష్ణారావు, ఎంపీటీసీ, రాజపురం–1


మా పేదల భూముల్లోనే పరిశ్రమలా..?



సెంటు భూమిలేని నిరుపేదలకు ఇచ్చిన డీపట్టా భూముల్లోనే పరిశ్రమలు కట్టాలా? మరెక్కడా భూమి లేదా..? మాలాంటి పేదల భూములు లాక్కోవడమే మీ అభివృద్ధికి మంత్రమా? మీకు మా పేదరికంపై కనికరం లేదా.. డబ్బున్న వారి చేతుల్లో మాలాంటి పేదలు మగ్గిపోవాల్సిందేనా? చావనైనా చస్తాం కానీ రెక్కలు ముక్కలుచేసి అభివృద్ధి చేసిన భూమిని వదలం.

– బైరెడ్డి సుబ్బారావు, బాధిత లబ్ధిదారు, రాజపురం

కుప్పిలి మాస్ కాపీయింగ్‌పై విచారణ



శ్రీనివాస్ రెడ్డికి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య మీద వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో సోమవారం విచారణ నిర్వహించారు. విచారణ అధికారిగా విద్యాశాఖ స్టేట్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ జేఏసీ నాయకుల ముందు ఎనిమిది ప్రశ్నలను విచారణ అధికారి ఉంచారు. లావేరు ఎంఈఓ–1గా వ్యవహరించిన ఎం.వాగ్దేవి, ఎచ్చెర్ల ఎంఈఓ–2 రాజ్ కిశోర్ సైతం విచారణ అధికారి ఎదుట హాజరయ్యారు. లిఖిత పూర్వకంగా సమాధానాలు ఇవ్వాలని విచారణ అధికారులు సూచించారు. భోజనం అనంతరం ఇస్తానని డీఈఓ దాటవేత ధోరణి ప్రదర్శించినట్లు పలువురు తెలిపారు. పరీక్ష కేంద్రంలో దొరికాయని చెబుతున్న స్లిప్పులకు, ప్రశ్నపత్రానికి సంబంధం లేదని, ఇన్విజిలేటర్ సంతకం లేకుండా ఉద్దేశపూర్వకంగా డీబార్ చేయడం అశాస్త్రీయమని సంఘ నేతలు తమ లిఖితపూర్వక వాగ్దానంలో రాసిచ్చినట్లు సమాచారం. బుడగట్లపాలెం, కొయ్యాం పాఠశాల ప్రధానోపాధ్యాయులను డీఈఓ పిలిపించుకొని కుప్పిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్ కిశోర్‌కు డబ్బులిచ్చామని బలవంతంగా స్టేట్‌మెంట్లు రాయించుకున్నారని ఆరోపించారు. డీఈఓపై చర్యలు తీసుకోవాలని కోరారు. 14 మంది టీచర్లపై చార్జీలను, క్రిమినల్ కేసులను పూర్తిగా ఉపసంహరించుకోవాలని విచారణ అధికారికి విన్నవించారు.

క్లుప్తంగా

రావిశాస్త్రి ప్రసంగానికి శరత్‌బాబు ఎంపిక


జంధ్యాల శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్: సుప్రసిద్ధ రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా రేడియోలో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమానికి నగరానికి చెందిన రచయిత జంధ్యాల శరత్‌బాబు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 30న రావిశాస్త్రి జయంతి పురస్కరించుకొని 'సామాన్యుడి అండదండ రావిశాస్త్రి' అంశంపై ప్రసంగం చేయనున్నారు.

యువతి ఆత్మహత్య

తడ: అనారోగ్యంతో శ్రీకాకుళం జిల్లా, నందిగాం మండలం, గొల్లవూరు గ్రామానికి చెందిన జీరు పూజిత(21) అనే యువతి ఆదివారం రాత్రి తన గదిలో ఉరి వేసుకుని మృతి చెందింది. ఎస్‌ఐ కొడవనాయుడు కథనం మేరకు.. తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేసే పూజిత తడకండ్రిగలోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ గదిలో అద్దెకు నివసిస్తోంది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆమెను అదే పరిశ్రమలో పని చేసే ఆనంద్ కృష్ణన్ అనే మిత్రుడు తరచూ పరామర్శిస్తుండేవాడు. ఈ క్రమంలో చనిపోయిన రోజు కూడా ఆనంద్ కృష్ణన్ ఆమెను ఉదయం పలకరించి వెళ్లాడు. సాయంత్రం వచ్చిన అతను పూజిత గదిలో సీలింగ్ ఫ్యాన్‌కి చున్నీతో ఉరి వేసుకుని ఉన్నట్టు గమనించి, అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మరో వ్యక్తి సాయంతో తలుపులు పగుల కొట్టి ఆమెను కిందకు దించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మృతురాలి తండ్రి శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వడంతో సోమవారం తడకు వచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కొడవనాయుడు తెలిపారు.

మురికి కూపం.. రైతులకు శాపం..!


వ్యర్థాలు, మురుగు నీటితో నిండిన కాలువ

- ఒడిశా మురుగు నీటి కాలువలతో ఇక్కట్లు
- వ్యర్థాలతో నిండుతున్న పంట పొలాలు
- పంటలు పండించలేని పరిస్థితి

పాతపట్నం: పాతపట్నం – పర్లాకిమిడి పట్టణాలు ఇరుగుపొరుగున ఉంటాయి. పర్లాకిమిడి పట్టణంలో అలనాటి రాజుల హయాంలో భారీ ఎత్తున మురుగునీటి కాలువలను నిర్మించారు. అయితే ఒడిశా రాష్ట్రంలోని పర్లాకిమిడి పట్టణ ప్రజలు వినియోగించే ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ సంచులు, గాజు సీసాలు, మురుగు నీరు సరాసరి కాలువల ద్వారా ఆంధ్ర ప్రాంతం పాతపట్నం మండలంలోని హరిజన గోపాలపురం, కాపుగోపాలపురం గ్రామాలకు చేరుతుంది. ఈ గ్రామాల మీదుగా మహేంద్రతనయ నదిలో కలుస్తోంది.

పంట పొలాల్లో మురికి నీరు

కాలువల ద్వారా వస్తున్న మురికి నీరు, వ్యర్థాలు పాతపట్నం, కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాలకు చెందిన సుమారు 40 ఎకరాలు పంట పొలాల్లో చేరుతున్నాయి. దీంతో కాలుపెడితే బయటపడలేనంత దుస్థితికి చేరుకుంది. ఇటువంటి పరిస్థితిలో కొన్నేళ్లగా ఈ పంట పొలాలను రైతులు వినియోగించలేకపోతున్నారు. ఈ ప్రాంతంలో భూములకు ఎకరాకు రూ.7 లక్షలకు పైగా విలువ ఉంది. అయితే ప్రస్తుతం ఇటువంటి భూములు నిరుపయోగం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒడిశా నుంచి వచ్చిన మురుగునీరు మహేంద్రతనయ నదిలో కలుస్తుంది. అయితే దీనివలన పంట పొలాల్లో మురుగునీరు చేరుతుండడంతో పండించలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పర్లాకిమిడి మురుగు నీరు పాతపట్నం రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంట భూములు నిరుపయోగం


ఎంతో విలువైన భూముల్లో మురికి నీరు, చెత్తా చెదారం చేరింది. కాలువలు సరిగా లేక పోవడం వలనే పంట పొలాల్లోకి మురుగు నీరు చేరుతోంది. కాలుపెడితే గాజు పెంకులు గుచ్చుతాయి. గత ఎనిమిది సంవత్సరాలుగా సాగు చేపట్టడం మానుకున్నాం. – గుర్రాల హరినారాయణ, హరిజన గోపాలపురం, పాతపట్నం

పంటలు వేయలేకపోతున్నాం


పంట భూముల్లోకి మురుగు నీరు రావడం వల్ల పొలాల్లో నీరు నిల్వ ఉండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. పొలం వద్దకు వెళ్లలేకపోతున్నాం. ఎనిమిదేళ్లుగా ఇదే పరిస్థితి. – ఎండీ కృష్ణారావు, కాపు గోపాలపురం, పాతపట్నం

చర్యలు తీసుకుంటాం


సరిహద్దు ప్రాంతంలోని పంట పొలాల్లో మురికి నీటిని పరిశీలిస్తాం. ఒడిశా మురుగు నీరు ఆంధ్రాలోకి రాకుండా నిలుపుదల చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటాం. – ఎన్.ప్రసాదరావు, తహసీల్దార్, పాతపట్నం

అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీకోసంలో 98 అర్జీల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)లో ఆయన అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, డ్వామా, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల సమస్యలపై 98 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజ తదితరులు పాల్గొన్నారు.

కొన్ని అర్జీలను పరిశీలిస్తే...

- రిమ్స్ సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ రిమ్స్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో 15 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్నామని, సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పాత కాంట్రాక్టర్ మే నెల వేతనం, ఏప్రిల్, మే ఏరియర్స్ చెల్లించలేదన్నారు. జూన్ నుంచి కొత్త కాంట్రాక్టర్ బాధ్యతలు తీసుకుని రెండు నెలలుగా గడుస్తున్నా ఇప్పటివరకు వేతనం చెల్లించలేదని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కో–కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, రిమ్స్ నాయకులు ఎం.సూర్యనారాయణ, టి.రామారావు, బి.శ్రీను, ఎస్.రాజేంద్ర, ఎం.శ్రీను, హెచ్.లక్ష్మణ, టి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.
- గార మండలం శ్రీకూర్మాం గ్రామ పంచాయతీ పరిధిలో 4 గ్రామ సచివాలయాలు, 7 గ్రామాలు ఉన్నాయని, ఆయా గ్రామాల రైతులకు సక్రమంగా ఎరువులు అందడం లేదని ఆ పంచాయతీ సర్పంచ్ బరాటం జయలక్ష్మి పేర్కొన్నారు. కొంతమందికే ఎరువులు అందుతుండడంతో మిగిలినవారు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.
- కుటుంబ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే కాకుండా ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వారి పేరు మీద హౌస్ టాక్స్ మార్పు చేస్తానని దుర్భాషలాడుతున్న నగర పాలక సంస్థ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన కొత్తపల్లి లక్ష్మి, శ్రీనివాసరావు, పోలుమూరు మీనాక్షిలు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికకు హాజరై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- లావేరు మండలం కొత్తకుంకాం గ్రామానికి చెందిన చిత్తూరు మాలక్ష్మికి ప్రభుత్వం ఇచ్చిన రెండెకరాల భూమిని వేరేవారు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు.
- గ్రీవెన్స్‌లో సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి పౌరసరఫరాల శాఖ సిబ్బంది నిరాకరిస్తున్నారని లావేరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన అర్జీదారుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆన్‌లైన్ నమోదు కేంద్రం వద్దకు వెళ్లి సిబ్బంది వివరణ కోరారు. నమోదు కేంద్రంలోనే కలెక్టర్ కూర్చొని అర్జీదారుడి సమస్యను సిబ్బందితో నమోదు చేయించారు.
- తన కుమారులు తనను సరిగా చూడడం లేదని, తనకు న్యాయం చేయాలని పోలుమూరు మీనాక్షి అనే వృద్ధురాలు కలెక్టర్‌కు విన్నవించారు. తన కుమారులు పోలుమూరు ఈశ్వరరావు, సింహాచలం తనకు ప్రతి నెలా రూ.3 వేలు ఇచ్చేవారని, ఇవ్వడం మానేయడంతో తాను కుమార్తెను ఆశ్రయించి ఆమె వద్ద బతుకుతున్నట్లు వివరించారు. తనకు చెందిన ఆస్తిని కుమార్తెకు రాసివ్వడం తన కుమారులకు నచ్చలేదన్నారు. ఆ ఆస్తిని తిరిగి ఇవ్వాలని తన అన్నయ్యలు ఇద్దరు మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని కొత్తపల్లి లక్ష్మి కూడా తల్లితో సహా వచ్చి ఫిర్యాదు చేశారు.

కారులో నాటుసారా రవాణా

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు


స్వాధీనం చేసుకున్న కారు, నాటుసారాతో ఎక్సైజ్ సిబ్బంది

కంచిలి: ఒడిశా నుంచి ఆంధ్రా గ్రామాలకు విచ్చలవిడిగా నాటుసారా రవాణా అవుతోంది. ఏకంగా కార్లలోనే దర్జాగా నాటుసారాను పాలిథిన్ సంచుల్లో, చిన్నసైజు ప్యాకెట్ల రూపంలో పల్లెలకు దిగుమతి చేసుకుంటున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ రవాణాపై పటిష్ట నిఘా పెట్టారు. ఒడిశా – ఆంధ్ర అంతర్రాష్ట్ర కార్ల కదలికల మీద నిఘా ఉంచారు. ఈ నిఘాలో భాగంగా ఒడిశా సరిహద్దు గ్రామమైన కేసరపడ వద్ద ఒక కారు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని పరిశీలించారు. దీంతో ఆ కారులో ఆరు ప్లాస్టిక్ గోనె సంచుల్లో ఒక్కొక్కదానిలో 150 నాటుసారా ప్యాకెట్లను ప్యాక్‌చేసి, మొత్తంగా 900 నాటుసారా ప్యాకెట్లు(90 లీటర్లు) తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. సారాతోపాటు కారును సీజ్‌చేసి, నాటుసారా రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం మునిసిపేటకు చెందిన మొగిలి కుమార్‌ను, నాటుసారా తెప్పించిన పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన లోట్ల జోగారావును అరెస్టు చేశారు. నాటుసారా పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతిలను సీఐ అభినందించారు.

ముద్దాయికి రెండున్నర ఏళ్ల జైలు శిక్ష

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరు పంచాయతీ పరిధి కొత్త కొత్తూరులోని ఉమామల్లిఖార్జున స్వామి ఆలయం తాళాలను, హిరమండలంలోని సుబలాయి గ్రామానికి చెందిన రాగోలు బాలకృష్ణ 2019లో పగలుగొట్టి రూ.20 వేల నగదును చోరీ చేశాడు. ఈ ఘటనలో ముద్దాయి బాలకృష్ణపై నేరం రుజువు కావడంతో ఆయనకు కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కందికట్ల రాణి సోమవారం రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్లు స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు సోమవారం తెలిపారు. ఈ ఘటనపై 2019వ సంవత్సరంలో కొత్తూరు ఎస్‌ఐగా పని చేసిన బాలకృష్ణ కేసు నమోదు చేశారు. కేసును ఎస్‌ఐలు బాలకృష్ణ, కె.గోవిందరావులు దర్యాప్తు చేశారన్నారు. ఏపీపీగా ఎల్.నాగభూషణరావు వ్యవహరించారు.

యువకుడి మృతిపై ఆందోళన


శ్రీరాములు (ఫైల్)


మృతదేహంతో ర్యాలీ చేస్తున్న కుటుంబ సభ్యులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలంలోని పెద్దబమ్మిడి గ్రామానికి చెందిన పినిమింటి శ్రీరాములు(20) అనే యువకుడు శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానం ఉందంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు శ్రీరాములు ఈనెల 25వ తేదీన కొంతమంది యువకులతో కలిసి ద్విచక్ర వాహనంపై సారవకోట మండలం వైపు వెళ్లాడు. అయితే అదేరోజు రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో తమ కుమారుడిని ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కానీ శ్రీరాములుది రోడ్డు ప్రమాదం కాదని, గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. తీవ్రగాయాలతో బ్రెయిన్ డెడ్ కావడంతో చికిత్స పొందుతూ శ్రీరాములు 27వ తేదీన మృతి చెందాడని, తన కుమారుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి లక్ష్మణరావు, తల్లి లక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సోమవారం మృతదేహంతో పెద్దబమ్మిడి వద్ద ర్యాలీ చేపట్టారు. అయితే ఇదే విషయంపై సారవకోట పోలీసులను ప్రశ్నించగా మృతి చెందిన యువకుడు ఈనెల 25వ తేదీన సారవకోట మండలం జగ్గయ్యపేట వద్ద రోడ్డు పక్కన ఉన్న రైలింగ్‌ను ఢీకొన్నట్లు పేర్కొన్నారు. ఇది గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108లో శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 27వ తేదీన మృతి చెందినట్లు తెలిపారు. కాగా శ్రీరాములు అవయవదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది ఆ యువకుడి అవయవాలను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 52 వినతులు


ఫిర్యాదుదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు ప్రజల నుంచి 52 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ (అడ్మిన్) కేవీ రమణలు అర్జీలు స్వీకరించి బాధితులకు సకాలంలో న్యాయం చేస్తామని భరోసా కల్పించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పెదపాడు పంచాయతీ పరిధి ధర్మాన లే అవుట్‌లో భార్యాభర్తల మధ్య తలెత్తిన తీవ్ర మనస్పర్థలు ఓ వివాహిత ప్రాణాలను బలిగొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మాన లే అవుట్‌లో నివసిస్తున్న యవ్వారి రాజేష్ కుటుంబంలో ఒక శుభ కార్యానికి సంబంధించి భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ గొడవలో తన అభిప్రాయానికి విలువ లేకుండా భర్త మాటే నెగ్గుతుందని భావించిన భార్య అనూష(30) తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో ఈనెల 23వ తేదీన దోమల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన స్థానికులు వెంటనే శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స పొందుతున్న అనూష సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి పాలవలస మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం



రణస్థలం: మండలంలోని పైడి భీమవరం గ్రామానికి చెందిన కంఠస్ఫూర్తి కనకరాజు ఈనెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని జే.ఆర్.పురం పోలీసులు సోమవారం తెలిపారు. వయస్సు 78 సంవత్సరాలు, మతి స్థిమితం సరిగ్గా లేదని చెప్పారు. ఈ మేరకు కుమారుడు సత్తిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎస్.చిరంజీవి వెల్లడించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి దూసి – పొందూరు రైల్వేస్టేషన్ల మధ్యలో సోమవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుడికి సుమారు 65 ఏళ్ల వయస్సు ఉంటుందని, నీలం, ఎరుపు రంగు గీతల షర్టు, నీలం గళ్ల లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122 [B-1275594]
- ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25006667]
- కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-16111]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజనల్ ఆఫీస్, ఇ.నెం.8, సింహద్వారం ఆర్చ్ దగ్గర, వెంకటాపురం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్ : 08942 - 270919.

ఇ-వేలం అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకం కొరకు)

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ప్రకారం స్థిరాస్తుల 15 రోజుల అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకమునకు ఋణగ్రహీత/లు మరియు హామీదారు/లు తెలియజేయునది ఏమనగా ఈ క్రింద తెలియజేయబడిన స్థిరాస్తులు బ్యాంకునకు తనఖా ఉంచి పొందిన ఋణము తిరిగి చెల్లించుటలో విఫలమైనందున యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి వారు బకాయి సొమ్మును ఋణగ్రహీత/లు మరియు హామీదారు/లు నుండి తిరిగి రాబట్టుకునేందుకు సదరు ఆస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" అనే పద్ధతిపై దిగువ తెలిపిన బకాయి సొమ్ములను మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలను రాబట్టుకొనుటకు ఋణదాత అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు తేది.14.08.2025న సదరు ఆస్తులను ఇ-వేలం ద్వారా అమ్మకం చేయుదురని తెలియజేస్తూ ఈ నోటీసు జారీ చేయబడినది.

1 టెక్కలి బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా ఫోన్ : 08945 - 244447

ఋణగ్రహీతలు: 1. మెస్సర్స్ ఒమేగా వైర్లింగ్ ఎలక్ట్రోడ్స్, ప్రొప్రయిటర్ : శ్రీ సంజీవి శ్రీధర్ (లేటు), తండ్రి : నరసింహ మూర్తి, డోర్ నెం. 1-157, మిరపకాయ పేట, రావి వలస గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా - 532212. 2. శ్రీమతి పొంద్రాటి ప్రేమ కుమారి, భర్త: సంజీవి శ్రీధర్ (లేటు), డోర్ నెం.1-157, మిరపకాయ పేట, రావి వలస గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా - 532212 (శ్రీమతి సంజీవి నారాయణమ్మ (లేటు) మరియు శ్రీ సంజీవి శ్రీధర్ (లేటు) గార్ల చట్టరీత్యా వారసులు). 3. కుమారి సంజీవి విశాలాక్షి, తండ్రి : సంజీవి శ్రీధర్ (లేటు), డోర్ నెం.1-157, మిరపకాయ పేట, రావి వలస గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా - 532212 (శ్రీ సంజీవి శ్రీధర్ (లేటు) గారి చట్టరీత్యా వారసులు). 4. బేబి సంజీవి సాయి సాత్విక, తండ్రి : సంజీవి శ్రీధర్ (లేటు), డోర్ నెం.1-157, మిరపకాయ పేట, రావి వలస గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా - 532212 (ప్రొప్రయిటర్ లేటు శ్రీ సంజీవి శ్రీధర్ గారి చట్టరీత్యా వారసులు (మైనర్ ప్రాతినిధ్యం వహిస్తున్నది శ్రీమతి పొంద్రాటి (ప్రేమ కుమారి). 5. మాస్టర్ సంజీవి మణికంఠ, తండ్రి : సంజీవి శ్రీధర్ (లేటు), డోర్ నెం.1-157, మిరపకాయ పేట, రావి వలస గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా - 532212 (ప్రొప్రయిటర్ లేటు శ్రీ సంజీవి శ్రీధర్ గారి చట్టరీత్యా వారసులు (మైనర్ ప్రాతినిధ్యం వహిస్తున్నది శ్రీమతి పొంద్రాటి (ప్రేమ కుమారి). 6. శ్రీ సంజీవి నరసింహ మూర్తి, తండ్రి : నీలకంఠం, డోర్ నెం.1-157, ...

డిమాండ్ నోటీసు తేది : 08-02-2023 స్వాధీనత నోటీసు తేది : 24-05-2023

...

డిమాండ్ నోటీసు తేది : 05-01-2023 స్వాధీనత నోటీసు తేది : 24-05-2024

బకాయి మొత్తం : తేది.05.01.2023 నాటికి రూ.5,28,625.43 పై (అక్షరాల ఐదు లక్షల ఇరవై ఎనిమిది వేల ఆరు వందల ఇరవై ఐదు రూపాయల నలభై మూడు పైసలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

స్థిరాస్తి వివరములు: శ్రీకాకుళం - 532284 మీదుగా బారువ, సోంపేట మండలం, గొల్లవూరు ఉప్పలం పోస్ట్, సర్వే నెం.157/1 వద్ద 450 చ॥అ॥ల విస్తీర్ణం గల నివాస భూమి మరియు భవనం సేల్ డీడ్ నెం.327/91 ప్రకారం శ్రీ వంకాల మోహనరావు గారికి చెందినది. హద్దులు: తూర్పు: వంకాల జోగమ్మ గారి ఇల్లు, పడమర : గండేయి దుర్యోధన గారి ఇల్లు, ఉత్తరం : కర్రి అప్పన్న గారి మెట్ట భూమి, దక్షిణం : వీధి రోడ్డు.

రిజర్వు ధర : రూ.6.24 లక్షలు | ధరావత్తు : రిజర్వు ధరలో 10% | బిడ్ పెంపుదల మొత్తం:రూ.6,500/-

బ్యాంకు వారికి తెలిసిన తాకట్టు ఋణ భారములు : లేవు

ఇ-వేలం తేది మరియు సమయం : 14-08-2025, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ వరకు (వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

ఆస్తుల విక్రయమునకు సంబంధించిన పూర్తి వివరములు మరియు నిబంధనల కొరకు, దయచేసి https://baanknet.com మరియు వెబ్‌సైట్ www.unionbankofindia.co.in నందు చూడగలరు.

తేది : 24.07.2025 స్థలం : శ్రీకాకుళం

సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, శ్రీకాకుళం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజనల్ ఆఫీస్, ఇ.నెం.8, సింహద్వారం ఆర్చ్ దగ్గర, వెంకటాపురం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్ : 08942 - 270919.

ఇ-వేలం అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకం కొరకు)

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ప్రకారం స్థిరాస్తుల 30 రోజుల అమ్మకం ప్రకటన

...

ఇ-వేలం తేది మరియు సమయం : 29-08-2025, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ వరకు (వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

ఆస్తుల విక్రయమునకు సంబంధించిన పూర్తి వివరములు మరియు నిబంధనల కొరకు, దయచేసి https://baanknet.com మరియు వెబ్‌సైట్ www.unionbankofindia.co.in నందు చూడగలరు.

తేది : 25.07.2025 స్థలం : శ్రీకాకుళం

సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, శ్రీకాకుళం

